క్లుప్తంగా

జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సృజన



ఎస్ఎస్‌తాడ్వాయి: కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన పోలెబోయిన సృజనను మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తనను ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సీతక్కకు, జిల్లా నాయకులకు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్ విందు



ఎస్ఎస్‌తాడ్వాయి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని కాటాపూర్‌లోని ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు అరెం లచ్చుపటేల్ శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లచ్చుపటేల్ మాట్లాడుతూ.. ముస్లింలకు పవిత్రమాసం రంజన్ అని అన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు లచ్చుపటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రంజన్ శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, తాడ్వాయి సర్పంచ్ ఇర్స సునీల్, నాయకులు సిద్దరెడ్డి, శ్రీనివాస్, పాలకుర్తి రవి, పాక రాజేందర్ పాల్గొన్నారు.

పోలీసుల అవగాహన



ఏటూరునాగారం: మొబైల్ పోయిందా అది మీ దగ్గరకు చేరాలంటే చేయాల్సిన పనులపై శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఏటూరునాగారం సెకండ్ ఎస్సై ఇంద్రయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసి దానిపై వివరించారు. మొబైల్ యజమానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయాలని, పోలీసులకు ఎలాంటి పత్రాలను అందించాలని తెలిపారు. మీసేవ కేంద్రం, పోలీస్ ఎఫ్ఐఆర్ నంబర్, సెల్ నంబర్, కొనుగోలు చేసిన బిల్, ఆధార్ కార్డును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సత్యం, ప్రజలు, సీఆర్‌పీఎఫ్, సివిల్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిరుపేద ముస్లిం యువతి వివాహం కోసం ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ యూనియన్ నాయకులు రూ.5వేలు ఆర్థిక సాయం శుక్రవారం ఏటూరునాగారం మసీదులో కుటుంబ సభ్యులకు అందజేశారు. వివాహం నిశ్చయం అయ్యాక తండ్రి మృతి చెందడంతో బ్లడ్ డోనర్స్ భరోసానిచ్చారు. వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలుసుకొని సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్, బండపల్లి సంతోష్, ఎర్రమనేని సతీష్, గండెపల్లి సుఖేష్, పెయ్యల రాకేష్, శేఖర్, కయ్యూమ్, నరేష్, ముస్లిం పెద్దలు వలిబాబా, ఆషు, యాకూబ్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



టేకుమట్ల: ఉపాధిహామీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ మంజులదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉపాధిహామీలో పని చేస్తున్న ప్రతీ కూలీకి ప్రభుత్వం రూ.272లను చెల్లిస్తుందన్నారు. ఉపాధిపనిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేయాలని తెలిపారు. చెరువుల్లో తీసిన మట్టిఎరువుగా పంటలకు ఎంతో ఉపయోగపడుతుంది కావున రైతులు పొలాల్లో పోసుకుని నేలను సారవంతం చేసుకోవాలన్నారు. ఎండల తీవ్ర ఎక్కువగా ఉంది కావున తగు జాగ్రత్తలు తీసుకుని పనులు ముగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, స్థానిక సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలతసురేష్, ఏపీఓ మాధవి, ఈసీ రాము, టీఏ మహేందర్ ఉన్నారు.

నిరుపయోగంగా స్టీమ్ కుక్కర్లు!

- తుప్పుపడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న స్టీమ్ కుక్కర్లు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లకు పంపిణీ చేసిన స్టీమ్ కుక్కర్లు వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగా మారాయి. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యను బట్టి కుక్కర్లు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు ఎక్కువ సంఖ్య ఉన్న పాఠశాలల్లో కుక్కర్ల ద్వారా వంటలు చేయడం సాధ్యపడడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. విద్యార్థులకు తక్కువ సమయంలో నాణ్యమైన భోజనం తయారు చేసేందుకు ప్రభుత్వం స్టీమ్ కుక్కర్లను పంపిణీ చేసింది. కుక్కర్లతోపాటు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాల్సి ఉండగా నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా సిలిండర్లు ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. దీంతో కట్టెల పొయ్యిలపై వంటలు చేయడం భారంగా మారిందని పాఠశాల నిర్వాహకులు పేర్కొంటున్నారు. స్టీమ్ కుక్కర్‌లలో ఇడ్లీ, పంపు, సాంబార్, అన్నం తయారు చేయాలని, గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయపోవడంతో నిరూపయోగంగా మారి తప్పుపట్టిపోతున్నాయి. లక్షలు వెచ్చించి స్టీమ్ కుక్కర్లను పంపిణీ చేసిన గిరిజన సంక్షేమశాఖ ఉన్నాతాధికారులు, బాధ్యతగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం మారిచిపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కట్టెల పొయ్యి మీదనే వంటలు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో స్టీమ్ కుక్కర్లు ఉన్నప్పటికీ గ్యాస్ సిలిండర్లు లేకపోవడంతో కట్టెల పొయ్యిల మీదనే విద్యార్థులకు వంటలు చేస్తున్నారు. కట్టెల పొయ్యి మీద వంటలు చేయడంతో వర్కర్లు ఎక్కువ శ్రమపడాల్సి వస్తుంది. స్టీమ్ కుక్కర్‌లలో వంటలు చేయాలంటే ఎక్కువ మొత్తంలో వంటలకు కట్టెలను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడడంతో యథవిధిగా కట్టెల పొయ్యిల మీదనే వంటలు చేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలనే ప్రభుత్వ ఉద్దేశ్యంతో స్టీమ్ కుక్కర్లను పంపిణీ చేసినప్పటికీ అధికారులు గ్యాస్ సిలిండర్లను పంపిణీపై ఆచరణలో అమలు చేయకపోవడంతో కుక్కర్లు పనికి రాకుండా పోతున్నాయి.

వినియోగంలోకి తీసుకువస్తాం..

పాఠశాలల్లోని స్టీమ్ కుక్కర్లను వినియోగంలోకి తీసుకువస్తాం. త్వరలోనే గ్యాస్ సిలిండర్లను అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తాం. ఇటీవలన ప్రభుత్వానికి గ్యాస్ సిలిండర్ల కోసం ఇండెంట్ పంపించాం. అన్ని పాఠశాలల్లో స్టీమ్ కుక్కర్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– దేశిరాంనాయక్, డీటీడీఓ

మండల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి

ములుగు రూరల్(గోవిందరావుపేట): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పాటుపడాలని ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అన్నారు. మన ఊరు -మన బడి పనులను పూర్తి చేయాలని అన్నారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న కారణంగా వడదెబ్బతగలకుండా జాగ్రత్తలు వహించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సుకుమార్ సూచించారు. గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ తొలగించిన విషయంపై మండలసభలో ప్రస్తావించగా ఎంపీపీ విద్యుత్ శాఖ అధికారులను వివరన కోరారు. విద్యుత్‌శాఖ అధికారి మాట్లాడుతూ.. సర్విస్ వైర్ దెబ్బతిని ప్రమాదకరంగా మారడంతో తొలగించామని తెలిపారు. అనంతరం పశువైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు వేసవిలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు వివరించారు. ప్రభుత్వం రెండవ విడత గొర్రెల పంపిణీ , ఎస్ఎల్ఎం పథకం గురించి వివరించారు. మండలంలో గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న జూనియయర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ అల్లెం రాజ్‌కుమార్, వ్యవసాయ మండల అధికారి జితేందర్, ఎంపీఓ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

దళారీ వ్యవస్థను నిర్మూలించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఇసుక రీచ్‌ల్లో దళారీల వ్యవస్థను నిర్మూలించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అంటి నాగరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ.. ఇసుకరీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమఇసుక తొవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. ఇసుక రీచ్‌ల్లో దళారీ వ్యవస్థను నిర్మూలించి గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తుర్స కృష్ణ, చంటి, బోదబోయిన స్వాతి, సబక సాయి తదితరులు ఉన్నారు.

సభకు భారీగా తరలిరావాలి



ఎస్ఎస్ తాడ్వాయి: పార్టీ జెండాలను పంపిణీ చేస్తున్న నాగజ్యోతి



ఏటూరునాగారం: చెల్పాకలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లా కేంద్రంలో ఈనెల 25న నిర్వహించనున్న ప్రతినిధుల సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు దండుగల మల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యాకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రతినిధుల సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రతినిధుల సమావేశానికి ముందుగానే గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరణ చేసుకుని ఖచ్చితంగా హాజరు కావాలని సూచించారు. అనంతరం మండలంలోని గ్రామ కమిటీలకు పార్టీ మెటిరీయల్‌ను పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ఈనెల 25న చెప్పటబోయే జెండా పండుగకు గ్రామ కమిటీల అధ్యక్షులకు పార్టీ జెండాలు, ఇతర మెటీరియల్‌ను ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ శుక్రవారం అందజేశారు. గ్రామ గ్రామాన పార్టీ పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకర్, తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, రాంబాబు, కాళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

క్లినిక్ మూసివేత



క్లినిక్‌కు తాళాలు వేయిస్తున్న అధికారులు

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో ప్రైవేట్ క్లినిక్‌ను వైద్యాధికారులు శుక్రవారం మూసివేశారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన బొగట ప్రణీత్‌కు జ్వరానికి ఇంజక్షన్ వేయడంతో వికటించింది. దీంతో స్పందించిన కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జిల్లా వైద్యాధికారి అప్పయ్యలు వెంటనే విచారణ చేయాలని జిల్లా ఎంసీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ మంకిడి వెంకటెశ్వర్లును ఆదేశించారు. దీంతో అక్కడికి వెళ్లిన ఆయన క్లినిక్‌ను పరిశీలించారు. ప్రణీత్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల నుంచి వివరాలను సేకరించారు. ఇంజక్షన్ వేసిన తరువాత ఎక్కడెక్కడ వైద్యం చేయించారు. అక్కడి రిపోర్టులను పరిశీలించారు. ఇంజక్షన్ మూలంగానే కాలు సైజు తగ్గడంతో పాటు నడవడానికి ఇబ్బంది పెడుతున్నట్లు గుర్తించినట్లు మంకిడి వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం క్లినిక్‌కు తాళాలు వేసి మూసివేయించారు. ఆయన వెంట వాజేడు వైద్యుడు మధుకర్, పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



దుస్తులు అందిస్తున్న రవిచందర్ ప్రభుదాస్

ములుగు: మతసామరస్యానికి రంజాన్ పండుగ ప్రతిక అని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్, పట్టణానికి చెందిన వ్యాపారి ప్రభుదాసు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి చెందిన నిరుపేద ముస్లింలకు బట్టలు, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్ కుమార్, సహకార సంఘం వైస్ చైర్మన్ రాజు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షకీల్, యూత్ నాయకుడు ప్రభుతో పాటు తదితరులు ఉన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని గంగారంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు శుక్రవారం భూమిపూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య సర్పంచ్ గౌరబోయిన నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొండూరి శ్రీదేవి, నరేష్ దంపతుల చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పసుపు, కుంకుమలు తీసుకువచ్చి పూజలో పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మొగుళ్లపల్లి: కంటి వెలుగు శిబిరంలో ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బంగ్లాపల్లి, పాత ఇస్సిపేట గ్రామాల్లోని వైద్యాధికారిని నాగరాణి, నవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు రజిత, సరళతో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రేగొండలో పరామర్శిస్తున్న గండ్ర జ్యోతి

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లి, రేపాక, నాగుర్లపల్లి, దమ్మన్నపేట, నారాయణపూర్ గ్రామాలకు చెందిన చిర వెంకటయ్య, పొరండ్ల చేరాలు, గంజి దనుంజయ్, బొచ్చు రాజుగౌడ్, దూరిశెట్టి రాజనర్సయ్య, గణపాక ఎల్లయ్య, మోటం సాయిలు ఇటీవల పలు కారణాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట ఎంపీపీ పున్నం లక్ష్మీరవి, జెడ్పీటీసీ సాయిని విజయముత్యం, మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్, టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి ఉన్నారు.

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన రవీందర్ అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి రవీందర్‌ను పరామర్శించారు. చింతకుంట రామయ్యపల్లి సర్పంచ్ మధువంశీకృష్ణ ఉన్నారు.

నైన్‌పాకలో..

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పీఏ తునికుల ప్రవీణ్ కుమార్ తండ్రి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి స్వగ్రహం మండలంలోని నైన్‌పాక గ్రామం కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించాడు. జిల్లా నాయకులు క్యాతరాజు సాంబమూర్తి , రాజిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ ఉన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పోతుగల్లు, ఇప్పలపల్లి, ఆకినపల్లి, పర్లపల్లి గ్రామాలల్లో గండ్ర సత్యనారాయణరావు హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. యాత్రలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో కూడిన కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు. అనంతరం పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం అందరిని ద్రాక్షగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. గ్రామాలల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులను బంద్ చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇప్పటివరకు ఒక్క ఎకరానికి కూడా నీరు అందించని ఘనత బీఆర్ఎస్‌దేనని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వ్యవసాయ భూములకు పారే నీరంత కూడా కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల ద్వారా వస్తున్నవే అని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగుల, రైతుల ఆకలి చావులు, ఆత్మహత్యలు సామాన్య ప్రజల నెత్తిపై అప్పులు తప్ప ఎలాంటి ప్రయోజనాలు కలగలేదని అన్నారు. కేంద్రంలోని మోదీ అదానీ ఆర్థికంగా ఎదగడానికి మాత్రమే కృషి చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు మితిమీరిపోతున్నాయని అన్నారు. ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మండల మాజీ కో ఆపరేటివ్ చైర్మన్ పోలినేని లింగారావు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బండి సుదర్శన్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఓనపాకల ప్రసాద్, మండల ముఖ్య నాయకులు తక్కళ్లపల్లి రాజు, మండ రవి, మల్సాని రాజేశ్వర్ రావు, పడిదల ప్రకాష్ రావు, నడిగోటి రాము, ఓనపాకల లింగయ్య ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు



వాజేడు: కారును తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని మొర్రవానిగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం ఎస్సై తిరుపతి రావు ఆధ్వర్యంలో ముమ్మరంగా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మండలానికి వచ్చి వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

వాజేడులో..

వాజేడు: మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం పోలీసులు ముమ్మర తనిఖీలను నిర్వహించారు. మండల పరిధిలోని చీకుపల్లి వద్ద ఎస్సై రేఖఅశోక్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆపి సోదాలు చేశారు. ప్రయాణికులను ప్రశ్నించడంతో పాటు వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సెలవుల్లో పిల్లలపై అప్రమత్తత అవసరం

టేకుమట్ల/రేగొండ: వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని టేకుమట్ల, రేగొండ ఎస్సైలు చల్ల రాజు, ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనలలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎండ తాపానికి, సరదాకి వ్యవసాయ బావుల్లో చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్తారు కావున తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలన్నారు. ఈత సరదా పిల్లల కుటుంబాల్లో విషాధాన్ని నింపక ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వరాదని సూచించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలో పిల్లలు ద్విచక్ర వాహనాలను నడుపాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులు లింకులను పంపిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. కావున పిల్లలకు సెల్‌ఫోన్‌లను అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఇవ్వాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం వరకు నిత్యం పిల్లలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కాలిన పూరిల్లు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామంలో షార్టుసర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. యాకన్నగూడెం గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి ఇంట్లో సాయంత్రం సమయంలో షార్టుసర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయని తెలిపారు. గమనించాన గ్రామస్తులు ఇంటికి అంటుకున్న మంటలను ఆర్పారు.